సాక్షి సూర్యాపేట

సోమవారం : 22 : జులై : 2024



వైభవంగా బోనాలు..
ఆంథోల్ మైసమ్మ ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బోనాల ఉత్సవం వైభవంగా నిర్వహించారు.
- 8లో



జల్సాల కోసం చోరీలు
జల్సాల కోసం దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని కోదాడ పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు.
- 8లో



యాదాద్రిలో తగ్గిన భక్తుల రద్దీ
యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు తక్కువ సంఖ్యలో వచ్చారు.
- 8లో

న్యూస్‌రీల్

సీపీఎస్‌ను రద్దుచేయాలి

సూర్యాపేట టౌన్: ఈ నెల 25న జరిగే తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో కాంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్)ను రద్దుచేయాలని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు లక్కపాక ప్రవీణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 30 సంవత్సరాలు ఉద్యోగం చేసి పదవి విరమణ అనంతరం పెన్షన్ లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా సీపీఎస్ రద్దుకు నిర్ణయం తీసుకుని.. రాష్ట్ర వ్యాప్తంగా 2.50వేలకుపైగా సీపీఎస్ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

మద్దతు ధరల గ్యారంటీ చట్టం తేవాలి



మాట్లాడుతున్న కంబాల శ్రీనివాస్

హుజూర్‌నగర్: రైతులు పండించిన పంటలకు వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో మద్దతు ధరల గ్యారంటీ చట్టం తేవాలని రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్, కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం హుజూర్‌నగర్ పట్టణంలోని అనుమాల లింగయ్య భవన్‌లో నిర్వహించిన సంఘం మండల, పట్టణ సమితి నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే రైతు రుణ విముక్తి పథకాన్ని అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రూ.2లక్షల రైతు రుణమాఫీ విషయంలో అధికారులు రైతులకు సలహాలు అందించి న్యాయం జరిగేలా చూడాలన్నారు. కౌలు రైతులకు కూడా రైతు భరోసా అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, నాయకులు జక్కుల రమేష్, యల్లావుల రమేష్, కందుల వెంకటేశ్వర్లు, పి వాసుదేవరావు, మామిడి నరసయ్య, జక్కుల శ్రీనివాస్, జడ వెంకన్న, బంటు శ్రీను, లింగయ్య, సుందరయ్య, శాంసన్, బత్తిని మల్లయ్య, స్వామి, అంజయ్య, వెంకటేశ్వర్లు, పద్మావతి, రమేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలి



మాట్లాడుతున్న నాగిరెడ్డి

సూర్యాపేట టౌన్: బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని, ఆప్షన్స్‌లో తప్పిదాలు జరిగిన ఉపాధ్యాయుల అప్పీల్స్‌ను పరిష్కరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేటలోని టీపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పూర్వ ప్రాథమిక తరగతులను ప్రాథమిక పాఠశాలలకు అనుసంధానం చేయాలన్నారు. తరగతికి ఒకగది, ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. పదోన్నతుల్లో మిగిలిన పాఠశాల సహాయకుల ఖాళీలను కౌన్సిలింగ్ జరపాలని, 317 మ్యాచ్‌వల్ ఉపాధ్యాయులకు బదిలీలు చేపట్టాలని, కేజీబీవీ ఉపాధ్యాయురాళ్లు, సిబ్బంది బదిలీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.భిక్షం, నాయకులు సుభాని, ఆర్.ప్రతాప్, టి.పూలన్, రవికుమార్, యాకయ్య, కృష్ణమూర్తి, నర్సయ్య, జాన్‌సుందర్, సైదులు, యాదగిరి, జానయ్య, కోటేశ్వరరావు, శ్యామ్‌కుమార్, అశోక్, శ్రీనివాస్, మహేందర్ పాల్గొన్నారు.

యాదాద్రిలో ఆరాధనలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో ఆదివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాత సేవ, ఆరాధన చేపట్టారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళాలతో అర్చన చేశారు. ప్రాకారం మండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు గావించారు. సాయంత్రం ఆలయంలో జోడుసేవను భక్తుల మధ్యన ఊరేగించారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

● జయజయ సాయి





గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీసాయిబాబా ఆలయంలో బాబా దర్శనం కోసం బారులుదీరిన భక్తులు, సాయిబాబా సన్నిధిలో పూజలు చేస్తున్న మహిళలు

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం, అమ్మవార్లకు కుంకుమ పూజలు చేశారు. అనంతరం విశ్వక్సేనారాధన, పుణ్యావచనం, రక్షాబంధనం, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు పూర్తిచేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు శ్రీనివాసచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

విజ్ఞానం పెంచేలా..

- పాఠశాలల్లో నేటి నుంచి 29 వరకు 'శిక్షా సప్తాహ్'
- వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలు
- నూతన విద్యావిధానం అమలై నాలుగేళ్లయిన సందర్భంగా..
- 950 స్కూళ్లు.. 54వేల మంది విద్యార్థులు



సూర్యాపేట టౌన్: విద్యార్థులకు చదువుతో పాటు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తూ వారిలో విజ్ఞానం పెంపొందించేలా కేంద్రప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. నూతన విద్యావిధానం అమల్లోకి తీసుకొచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సమగ్ర శిక్షా అభియాన్ ఆదేశాలు జారీ చేసింది. దీంట్లో భాగంగా శిక్షా సప్తాహ్ పేరుతో సోమవారం నుంచి ఈనెల 29వ తేదీ వరకు ఏడు రోజుల పాటు పాఠశాలల్లో డీఈఓ, ఎంఈఓ, కాంప్లెక్స్ జీహెచ్‌ఎంల పర్యవేక్షణలో ఆటలాడిస్తూ విజ్ఞానం పెంపు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే జిల్లాలోని పాఠశాలల జీహెచ్‌ఎంలకు ఆదేశాలు అందాయి.

అన్ని పాఠశాలల్లో తప్పనిసరిగా..

జిల్లాలో కేజీబీవీలు, గురుకులాలు, ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలతో కలిపి మొత్తం 950 స్కూళ్లు ఉన్నాయి. వీటిల్లో 54వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు అన్ని పాఠశాలల్లో తప్పనిసరిగా శిక్షా సప్తాహ్ అమలు చేయాల్సి ఉంటుంది. 6వ తరగతి నుంచి 10వరకు, 3 నుంచి 5వరకు, 0 నుంచి 2వ తరగతి వరకు విభాగాలుగా గుర్తించి కార్యక్రమాలను అమలు చేయనున్నారు. ప్రతిరోజూ ఏదో ఒక పీరియడ్‌లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని కొనసాగించాలని ఆదేశాలు జారీ చేశారు.

రోజువారి కార్యక్రమాలు ఇలా..

- ఈనెల 22న (సోమవారం) మొదటి రోజు నీటిని ఎలా ఆదా చేయాలి. ఇతరులకు ఎలా సాయం చేయాలనే దానిపై నినాదాలు, పోస్టర్లను విద్యార్థులతో సిద్ధం చేయించాలి. అలాగే ఆహారం-కూరగాయలు అనే అంశంపై సొంత కథనాలు రాయించాలి. వ్యర్థాలతో బొమ్మల తయారీపై అవగాహన, చార్ట్‌ల తయారీ తదితర అంశాలను చేయించాలి.
- 23న పాఠశాలల్లో అమలు చేసిన ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమానికి సంబంధించి ఉపాధ్యాయులు బోధనా పద్ధతులు ప్రదర్శించాలి. సెమినార్లు నిర్వహించడంతో పాటు కథలు చెప్పాలి.
- 24న క్రీడా దినోత్సవం నిర్వహించాలి. పిల్లలను దేశీయ ఆటలు ఆడించాలి. ఆటల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలి.
- 25న సాంస్కృతిక దినోత్సవాన్ని జరపాలి. వివిధ భాషలు, వేషధారణ, పద్ధతులపై పిల్లలకు అవగాహన కల్పించాలి. అవసరమైతే వారితో వస్త్రధారణ చేయించాలి. అలాగే చిత్రలేఖనం, జానపద నృత్యాలు, హస్తకళలు, వీధి నాటకాలు వేయించి విద్యార్థుల్లో నూతనోత్సాహాన్ని నింపాలి.
- 26న సాంకేతిక నైపుణ్యాల దినోత్సవంలో భాగంగా కోడింగ్ చాలెంజ్, జీవావరణ కార్యక్రమాలు చేపట్టాలి. వృక్షజాలం, జంతుజాలంపై అవగాహన కల్పించాలి. పిల్లలతో చారిత్రక స్థలాల సందర్శన తదితర 20రకాల వర్క్‌షాప్‌లు నిర్వహించాలి.
- 27న స్కూల్ న్యూట్రిషన్ డే నిర్వహించాలి. విద్యార్థులతో ఎకో క్లబ్‌లను ఏర్పాటు చేయాలి. క్లబ్‌ల భాగస్వామ్యంతో మొక్కల పెంపకం, కూరగాయల తోటల పెంపకం చేపట్టాలి.
- 29న సామాజిక భాగస్వామ్యం దినోత్సవాన్ని నిర్వహించాలి. సామాజిక సేవా కార్యక్రమాల్లో అందరినీ భాగస్వామ్యం చేయాలి.

ప్రతి స్కూల్‌లో అమలు చేయాలి



పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా ఉపాధ్యాయులు అమలు చేయాలి. వారం రోజుల పాటు రోజులో ఏదో ఒక పీరియడ్‌లో ఈ కార్యక్రమాలు నిర్వహించాలి. ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు అనేక విషయాలు తెలుస్తాయి.

– అశోక్, డీఈఓ, సూర్యాపేట

ప్రహరీ క్లబ్ నిఘా

- డ్రగ్స్ నియంత్రణకు హైస్కూళ్లలో ఏర్పాటు
- 14మందితో ప్రహరీ క్లబ్
- ప్రధానోపాధ్యాయుడే అధ్యక్షుడు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హుజూర్‌నగర్ : విద్యార్థులు భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే విద్యాలయాల్లోకి అక్రమంగా పాకుతున్న మాదకద్రవ్యాల కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ముఖ్యంగా ప్రభుత్వ జిల్లా పరిషత్, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల్లో డ్రగ్స్ మహమ్మారికి చెక్‌పెట్టేందుకు నూతనంగా ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల్లో ఆ దిశగా తగిన చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జిల్లాలో ఉన్నత పాఠశాలలు

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు మొత్తం కలిపి 338 వరకు ఉన్నాయి. వీటిలో దాదాపు 22,364 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరిని మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంచడం, వాటి బారిన పడకుండా చూడడానికి ఈ ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేయనున్నారు.

క్లబ్ ఏర్పాటు ఇలా..

ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రహరీ క్లబ్‌కు అధ్యక్షుడిగా ఉంటారు. పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు లేదా చైల్డ్ ఫ్రెండ్లీ టీచర్ ఉపాధ్యక్షుడిగా ఉంటారు. 6 నుంచి 10 తరగతుల నుంచి ఇద్దరు చొప్పున మొత్తం 10 పంది క్రియాశీల విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఒక ప్రతినిధి, స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ఒకరు సభ్యులుగా ఉంటారు. ఇలా 14 మందితో క్లబ్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. క్లబ్‌ల నిర్వహణకు సంబంధించి త్వరలో మార్గదర్శకాలు జారీ చేస్తారు.



హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల

భావితరాలను కాపాడడమే ధ్యేయం

పాఠశాలల స్థాయిలోనే మత్తు పదార్థాలకు విద్యార్థులను దూరం చేయాలనే లక్ష్యంతో ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల్లో ఈ క్లబ్‌లు ఏర్పాటు చేస్తారు. ప్రహరీ క్లబ్‌లలో పాఠశాలల హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో పాటు పోలీస్ అధికారులు, తల్లిదండ్రులు కూడా సభ్యులుగా ఉంటారు. వీరందరి భాగస్వామ్యంతో విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడుకోవడమే ధ్యేయం.

– అశోక్, డీఈఓ సూర్యాపేట

ప్రహరీ క్లబ్ లక్ష్యాలు..

మాదకద్రవ్యాలకు, సరఫరాకు అలవాటు పడిన విద్యార్థులు ఉంటే గుర్తించి, వారిని అప్రమత్తం చేసి డ్రగ్స్ దుష్ప్రభావాలు వివరించడం, వాటిని వాడకుండా మాన్పించడం. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు పిల్లల్ని ఉపయోగిస్తున్నట్లయితే తగిన జాగ్రత్తలు తీసుకొని కట్టడి చేయడం. పాఠశాల ఆవరణలో, చుట్టుపక్కల ఏదైనా కార్యకలాపాలు, మాదక ద్రవ్యాలు, ఆ పదార్థాల వినియోగం, అమ్మకం, అనుమానిత కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండటం ఈ ప్రహరీ క్లబ్‌ల ముఖ్య లక్ష్యాలు.

సమాజానికి బుద్ధుడి బోధనలే శరణ్యం

- తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి

నాగార్జునసాగర్ : సమాజ రుగ్మతలను రూపుమాపేందుకు బుద్ధుడి బోధనలే శరణ్యమని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి పేర్కొన్నారు. నాగార్జునసాగర్ జలాశయం తీరంలోని బుద్ధవనంలో ఆదివారం నిర్వహించిన ధర్మచక్ర పరివర్తన దినోత్సవానికి సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డితో కలిసి హాజరై మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు తెచ్చి బుద్ధవనాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి మాట్లాడుతూ సంపాదన వల్ల సంతోషం రాదని.. బుద్ధుడి బోధనలు అనుసరించడం వల్ల వస్తుందన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన భూటాన్ విద్యాశాఖ మాజీ మంత్రి ఆచార్య ఠాకూర్‌సింగ్ మాట్లాడుతూ హ్యాపీనెస్ ఇండెక్స్‌లో భూటాన్ ప్రపంచంలోనే అగ్రశ్రేణిలో ఉండటానికి బుద్ధుడి బోధనలే కారణమన్నారు. ముందుగా బౌద్ధభిక్షువులతో కలిసి బుద్ధుడి పాదాల చెంత పుష్పగుచ్ఛాలు ఉంచి ప్రార్థనలు చేశారు. తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.ప్రకాశ్‌రెడ్డి స్వాగతోపన్యాసం చేశారు. అమెరికా నుంచి వచ్చిన ప్రముఖ సితార్ విద్వాంసుడు డాక్టర్ మధుసారథి నందూరి, సితార్ వాద్య కచేరి ఆహూతులను అలరించింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, పీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, మాజీ జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, గడ్డంపల్లి వినయ్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, మార్కెట్ మాజీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, శివనాగిరెడ్డి, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



బుద్ధుడి పాదాల వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి ప్రార్థన చేస్తున్న రమేశ్‌రెడ్డి తదితరులు

రుణమాఫీకి రేషన్‌కార్డు నిబంధన తొలగించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి నాగార్జున్‌రెడ్డి

సూర్యాపేట: పదిహేను ఏళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డులు జారీ చేయనందున రైతు రుణమాఫీ విషయంలో రేషన్‌కార్డు నిబంధన తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల క్రితం వివాహమై వేర్వేరు కుటుంబాలుగా ఉంటూ వ్యవసాయం చేస్తున్న యువ రైతులకు బ్యాంకుల్లో పంట రుణాలు ఉన్నా మాఫీ కాలేదన్నారు. రాష్ట్రంలో అసైన్డ్ భూములు సాగు చేసుకుంటున్న రైతు కుటుంబాల వారసులకు ధరణి పాసుపుస్తకాలు మంజూరు కాక పెండింగ్‌లో ఉన్నాయని, అలాంటి రైతులకు కూడా రుణమాఫీ వర్తించే అవకాశం లేదన్నారు. 2014 నుంచి అమలు చేసిన రుణమాఫీ కాని రైతులు ఇంకా ఉన్నారని.. ఆ రైతులు బ్యాంకు రుణాలు 2018 డిసెంబర్ 12 గడువు లేకుండా మాఫీ చేయాలన్నారు. జీఓ ప్రకారం అప్పున్న రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు.

సాధారణానికి మించి వర్షం కురిసినా..

నిండని చెరువులు!

- ప్రశ్నార్థకంగా వానాకాలం వరిసాగు
- చెరువుల కింద 69వేల ఎకరాల ఆయకట్టు
- ముసురు వానతో మెట్టపంటలకే మేలు
- భారీ వర్షం కోసం రైతుల ఎదురుచూపు

భానుపురి (సూర్యాపేట): జిల్లాలో వానాకాలం సాగు ప్రశ్నార్థకంగా మారింది. సీజన్ ప్రారంభమై 45 రోజులు గడుస్తున్నా.. జిల్లాలోని ఏ ఒక్క చెరువులోకి వరదనీరు కొత్తగా వచ్చి చేరింది లేదు. అధికారిక లెక్కల ప్రకారం సాధారణ వర్షపాతానికి మించి వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలు మెట్టపంటల సాగుకే కొంతమేర ఉపయోగ పడే అవకాశం ఉండగా.. తరి పంటలకు అక్కెరకురాని పరిస్థితి నెలకొంది. గతేడాది నుంచి సరైన వర్షాలులేని కారణంగా బోరుబావుల్లోనూ భూగర్భ జలాలు తగ్గుతూ వస్తున్నట్లు రైతాంగం ఆందోళన చెందుతోంది. జిల్లాలోని 1,071 చెరువులు, కుంటల కింద సుమారు 69వేల ఎకరాల ఆయకట్టు సాగు సందిగ్ధంలో పడింది.

జిల్లాలో చెరువులు, కుంటలు

విస్తీర్ణం	చెరువులు	ఆయకట్టు
100 ఎకరాలకు పైబడిన	166	36,776
100 ఎకరాల లోపు	905	32,609
మొత్తం	1,071	69,385

వర్షపాతం ఇలా.. (మి.మీ.)

మాసం	సాధారణం	కురిసింది
జూన్	96.1	146.5
జూలై	178.8	91.03



ఆత్మకూర్ మండలం నెమ్మికల్ చౌటచెరువులోకి చేరిన కొద్దిపాటి నీరు


గతేడాది కంటే అధికంగానే..

జిల్లాలో నైరుతి రుతుపవనాలు జూన్ మాసంలో ప్రవేశించి వర్షాలు పడుతాయి. ఈ సమయంలో సాధారణ వర్షపాతం జూన్‌లో 96.1 కాగా ఈ ఏడాది 52 శాతం అధికంగా 146.5 మిల్లీమీటర్ల వర్షం పడింది. గతేడాది ఇదే మాసంలో 37 శాతం లోటు వర్షపాతం 60.5 మి.మీ. కురిసింది. జూలైలో సాధారణం 178.8 మి.మీ. కాగా.. ఇప్పటి వరకు 91.03 మి.మీ. మాత్రమే వర్షపాతం నమోదైంది. ఇదే సమయానికి గతేడాది సాధారణం కన్నా 61 శాతం అధికంగా 288.7 మి.మీ. వర్షం పడింది. ఈ లెక్కన జూన్ మాసంలో సాధారణ వర్షపాతానికి మించి 52 శాతం అధికంగా, జూలైలో సాధారణం కన్నా 20 శాతం తక్కువగా వర్షపాతం నమోదైంది. ఈనెల ముగిసేందుకు మరో పది రోజుల పాటు సమయం ఉండడంతో సాధారణాన్ని మించే వర్షపాతం నమోదయ్యే అవకాశముంది. గతేడాదితో పోల్చితే ఈసారి జూన్‌లో అధిక వర్షాలు కురిసినా జిల్లాలోని ఏ ఒక్క చెరువులోకి చుక్క కొత్తనీరు చేరలేదు. ఏ మండలంలో చూసినా చెరువుల్లో నీరులేకుండా గోతులు, తుమ్మలు దర్శనమిస్తున్నాయి.

రైతులకు తప్పని నిరీక్షణ

ఈనెలాఖరు వరకు ఇదేపరిస్థితి ఉంటే వానాకాలం పంటల సాగు కష్టతరంగా మారనుంది. పత్తి, ఇతర మెట్టపంటలకు ఇలాంటి వర్షాలు కొంత ఉపయుక్తంగా మారినా.. వరి సాగు ప్రశ్నార్థకంగా మారనుంది. చెరువుల్లోకి వరద నీరు చేరకుంటే.. వాటి పరిధిలో ఉన్న ఆయకట్టుతోపాటు బోరుబావుల్లో భూగర్భ జలాలు తగ్గుతాయి. ఇప్పటికే నార్లు పోసుకున్న రైతులు ఒక్క భారీ వర్షం పడితే.. పొలాలను దమ్ము చేసి నాట్లు వేయిద్దామని చూస్తున్నారు. కానీ జల్లులు, మోస్తరు వర్షాలు మినహా భారీ వర్షం పడట్లేదు. ఈ పదిరోజుల్లోనైనా భారీ వర్షాలు పడి చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతుందా.. లేదంటే గతేడాది మాదిరిగా వరుణుడు ముఖం చాటేస్తాడేమోనని రైతులు మదనపడుతున్నారు.

అడుగంటిన పులిచింతల ప్రాజెక్టు



పులిచింతల ఎగువ భాగంలో పవర్ ప్రాజెక్టు వైపు ఇలా..

హుజూర్‌నగర్: చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టు నీరు లేక అడుగంటింది. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా డెల్టాకు నీరందించే ఈ ప్రాజెక్టు జలకళ లేక అడుగున ఉన్న రాళ్లు కనిపిస్తున్నాయి. కృష్ణానది పరీవాహక ప్రాంతంలో సరైన వర్షాలు కురువకపోవడంతో ఈ ప్రాజెక్టులోనికి నీరు రావడం లేదు. దీనికి తోడు స్వల్ప లీకేజీలు ఉంతో ప్రాజెక్టులో నీరు అడుగుకు చేరింది. జిల్లాలో అడపాదడపా వర్షాలు కురుస్తున్నా ఈ నీరు చెప్పుకోదగ్గ రీతిలో ప్రాజెక్టుకు చేరడం లేదు. ప్రాజెక్టు నీరులేక వెలవెలబోతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 45.77 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.92 టీఎంసీల నీరు ఉంది. ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 351 క్యూసెక్కులు కాగా లీకేజీల ద్వారా అవుట్‌ఫ్లో 50 క్యూసెక్కులుగా నమోదైంది. గతే డాది ఇదేరోజున ప్రాజెక్టులో 17.14 టీఎంసీల నీరు ఉంది. అప్పట్లో 3,800 క్యూసెక్కుల నీటితో పవర్ హౌజ్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి కూడా చేశారు.

క్లుప్తంగా

గుట్కా ప్యాకెట్లు పట్టివేత


పట్టుబడిన గుట్కా ప్యాకెట్లను చూపుతున్న పోలీసులు

మఠంపల్లి: ఆంధ్రప్రదేశ్ నుంచి బైక్‌పై గుట్కా ప్యాకెట్లను తీసుకొస్తుండగా శనివారం రాత్రి మఠంపల్లి మండలంలోని జాన్‌పహాడ్ రోడ్ శివారులో పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం .. నేరేడుచర్లకు చెందిన పాన్‌షాప్ యజమాని షేక్ నజీర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా పిడుగురాళ్ల నుంచి ప్రభుత్వ నిషేధించిన గుట్కా ప్యాకెట్లు బైక్‌పై తీసుకొస్తుండగా.. మఠంపల్లి మండలం జాన్‌పహాడ్ రోడ్ శివారులో వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన గుట్కా ప్యాకెట్ల విలువ రూ.50వేలు ఉంటుందన్నారు. బైక్‌ను, గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చౌటుప్పల్‌లో..

చౌటుప్పల్: మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామంలో ఎస్‌ఓటీ పోలీసులు ఆదివారం నిషేధిత గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. లక్కారం గ్రామానికి చెందిన సూరిశెట్టి శ్రీధర్ ఇంటిపై ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి ఇంట్లో నిల్వ ఉంచిన నిషేధిత గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్ రెడ్డి తెలిపారు.

ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్ట్

మిర్యాలగూడ టౌన్ : ముగ్గురు పేకాటరాయుళ్లను ఆదివారం మిర్యాలగూడ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ కె. నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం అవంతీపురం వ్యవసాయ మార్కెట్ సమీపంలో గల ఖాళీ స్థలంలో కొంతమంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించి ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నారు. వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు, రూ.1800 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుండెపోటుతో గొర్రెలకాపరి మృతి


లచ్చయ్య (ఫైల్)

త్రిపురారం: గుండెపోటుతో గొర్రెలకాపరి మృతి చెందాడు. ఈ ఘటన త్రిపురారం మండలం బాబుసాయిపేట గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బాబుసాయిపేట గ్రామానికి చెందిన మోదాల లచ్చయ్య గొర్రెలు కాసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే శనివారం గొర్రెలను మేపడానికి గ్రామ సమీపంలోని తోటి గొర్రెల కాపరులతో కలిసి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వస్తుండగా.. గుండెలో నొప్పి వస్తుందంటూ తోటి గొర్రెల కాపారులకు చెప్పి పడిపోయాడు. దీంతో వారు లచ్చయ్య కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆస్పత్రికి తరలించే లోపే గుండెనొప్పి తీవ్రమై మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

బస్సును ఢీకొట్టిన కారు.. ఇద్దరికి గాయాలు

భువనగిరి క్రైం: భువనగిరి బస్టాండ్ సమీపంలో బస్సును కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్టకు చెందిన హరిప్రసాద్ మరో వ్యక్తితో కలిసి శనివారం అర్ధరాత్రి భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఉన్న తన బంధువులను చూసేందుకు కారులో వెళ్తున్నారు. అదే సమయంలో బస్టాండ్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న బస్సును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కారులో ఉన్న హరిప్రసాద్‌తో పాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన కారును పక్కకు తొలగించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా ఆంథోల్ మైసమ్మ బోనాలు


బోనాలను ఎత్తుకొని వస్తున్న మహిళలు, యువతులు


శివసత్తుల విన్యాసాలు

చౌటుప్పల్: మండల పరిధిలోని శ్రీఆంథోల్ మైసమ్మ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రెండో రోజు చండీ హోమంతో పాటు బోనాల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానన్నారు. భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్. మోహన్‌బాబు, మాజీ సర్పంచులు బొంతల ఓంప్రకాష్, ఎలువర్తి యాదగిరి, మాజీ ఎంపీటీసీ చిట్టంపల్లి శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు చిలుకూరి మల్లారెడ్డి, బుర్ర స్వామి, ముదిగొండ రమేష్, గుండు శ్రీహరి, చిట్టంపల్లి జంగయ్య, ఈడ్దుల విజయ్, గంగాధర గణేష్, అత్తాపురం అంజిరెడ్డి, ఎలువర్తి రవీందర్, కంచర్ల ప్రవీణ్‌రెడ్డి, బాలగోని శ్రీకాంత్, అన్నదాన దాత కామిశెట్టి విజయ్‌కుమార్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


పూజలు నిర్వహిస్తున్న భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

చింతపల్లిలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

చింతపల్లి: మండల కేంద్రంలోని షిర్డీ సాయినాథుడి దేవాలయంలో గురుపౌర్ణమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు లక్ష పుష్పార్చన, పంచామృతాభిషేకం, కాగడ హారతి, సంస్థాన హారతి, మధ్యాహ్న హారతి కార్యక్రమాలతో పాటు వేద పండితులతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. దేవరకొండ, నాగార్జునసాగర్ ఎమ్మెల్యేలు నేనావత్ బాలునాయక్, కుందూరు జైవీర్‌రెడ్డి సాయినాథుడిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మంచుకంటి ధనుంజయ్య, మండల పార్టీ అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, పవన్‌కుమార్, ముచ్చర్ల యాదగిరి, పీఏసీఎస్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, రాంసింగ్, గోవిందుయాదగిరి, సదానందం, రాధాకిషన్, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.


సాయినాథుడికి పూజలు చేస్తున్న దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ తదితరులు


సాయినాథుడిని దర్శించుకునేందుకు క్యూలో వేచిచూస్తున్న భక్తులు

జల్సాల కోసం చోరీలు.. దొంగ అరెస్ట్

- 26 తులాల బంగారం, కేజీ వెండి స్వాధీనం


ఆభరణాలను చూపుతున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐ రాము, పోలీస్ సిబ్బంది

కోదాదరూరల్ : ఇళ్లల్లో చోరీలు చేస్తున్న దొంగను కోదాడ పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి సీఐ రాముతో కలిసి ఆదివారం కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం మామకన్ను గ్రామానికి చెందిన సయ్యద్ అల్తాఫ్ అలియాస్ అఫ్రోజ్ తల్లిదండ్రులు చిన్నతనంలో మృతి చెందారు. దీంతో అతడు తన బాబాయి వద్ద పెరిగాడు. అల్తాఫ్‌కు స్నేహితులతో కలిసి జులాయిగా తిరుగుతూ మద్యం, బెట్టింగ్‌లకు బానిసయ్యాడు. దీంతో విలాసాలకు డబ్బులు సరిపోకపోవడంతో దొంగతనాలు చేస్తూ జైలు జీవితం కూడా గడిపాడు. మార్చి 18వ తేదీన బెయిల్‌పై బయటకు వచ్చిన అల్తాఫ్ నాలుగు నెలల వ్యవధిలో కొత్తగూడెం జిల్లా పాల్వంచ పోలీస్ స్టేషన్ పరిధిలోని 6 ఇళ్లలో, కోదాడ పట్టణంలోని మూడు ఇళ్లలో చోరీకి పాల్పడి బంగారు, వెండి ఆభరణాలను దొంగిలించాడు. ఆదివారం కోదాడ పట్టణంలోని గోల్డ్‌షాప్ బజారులో ఆభరణాలు విక్రయించేందుకు వస్తుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. అతడి వద్ద బంగారం, వెండి ఆభరణాలు లభ్యమవ్వడంతో అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరాలను ఒప్పుకున్నాడు. నిందితుడి వద్ద పోలీసులు 26 తులాల బంగారం, ఒక కేజీ నాలుగు వందల గ్రాముల వెండి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి, ట్రాఫిక్ ఎస్‌ఐ మల్లేష్, పోలీస్ సిబ్బంది యల్లారెడ్డి, సతీష్‌నాయుడు ఉన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి


పాలకవీడు : మృతిచెందిన పాడి గేదె

పాలకవీడు: విద్యుదాఘాతంతో పాడి గేదె మృతిచెందింది. ఈ ఘటన పాలకవీడు గ్రామ సమీపంలోని వ్యవసాయ భూముల్లో ఆదివారం జరిగింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకవీడు గ్రామానికి పగడాల మట్టేష్ రోజు మాదిరిగా తన పాడి గేదెను ఆదివారం గ్రామ సమీపంలోని పొలాల్లోకి మేతకు తోలుకెళ్లాడు. గ్రామంలోని శ్మశాన వాటిక వద్ద గల విద్యుత్ స్టార్టర్ బాక్స్ తెగిపడి ఉండగా పాడి గేదె మేత మేసుకుంటూ వెళ్లి దానికి తగిలి విద్యుదాఘాతానికి గురైంది. విద్యుత్ అధికారులకు సమాచారం అందించి విద్యుత్ సరఫరాను నిలిపివేయగా.. అప్పటికే గేదె మృతి చెందింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

రాజాపేటలో..

రాజాపేట: మండలంలోని చల్లూరు గ్రామంలో ఆదివారం విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. చల్లూరు గ్రామానికి చెందిన రైతు గంగు రాజిరెడ్డి తన వ్యవసాయ బావి వద్ద రోజుమాదిరిగానే ఆదివారం పాడి గేదెను మేత కోసం వదలగా పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతిచెందిన గేదె విలువ రూ.1.20లక్షలు ఉంటుందని, జీవనోపాధి కోల్పోయానని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

బావిలోకి దిగి ఊపిరాడక రైతు మృతి


లక్ష్మయ్య (ఫైల్)


లక్ష్మయ్య మృతదేహాన్ని బయటకు తీస్తున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది

మునగాల(కోదాడ): బోరు మోటారును బయటకు తీసేందుకు బావిలోని దిగిన రైతు ఊరిరాడక మృతిచెందాడు. ఈ ఘటన మునగాల మండలం కలకోవ గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కలకోవ గ్రామానికి చెందిన కొమర్రాజు లక్ష్మయ్య(52) తనకున్న ఎకరంన్నర భూమితో పాటు మరో నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. కౌలుకు తీసుకున్న భూమిలో గతంలో బావి ఉండేది. ఇటీవల ఆ బావిని పూడ్చివేసి అందులో వేసిన బోరు చుట్టూ రెండు అడుగుల గూనలు 20 వరకు వేశాడు. ఇదిలా ఉండగా బోరు మోటారు మరమ్మతుకు గురికావడంతో లక్ష్మయ్య తన తోటి రైతు తిప్పన శేషగిరి సాయంతో ఆదివారం బావిలోకి దిగి మోటారును పైకి లాగేందుకు తాడు కడుతుండగా ఊపిరిడాక అందులోనే ప్రాణాలు వదిలాడు. బావి బయట ఉన్న శేషగిరి ఇది గమనించి వెంటనే గ్రామంలోని పలువురికి సమాచారం ఇచ్చాడు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి దొంగరి సైదులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరకుని తహసీల్దార్ వలిగొండ ఆంజనేయులుకు సమాచారం ఇవ్వడంతో ఆయన పోలీసులు, ఫైర్ సిబ్బందికి ఫోన్ ద్వారా విషయం చెప్పడంతో వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు బావిలోకి దిగే ప్రయత్నం చేసినప్పటికీ ఊపిరాడకపోవడంతో బయటకు వచ్చారు. దీంతో ఫైర్ సిబ్బంది, స్థానికుల సహకారంతో జేసీబీని ఉపయోగించి గూనలు తొలగించి లక్ష్మయ్య మృతదేహాన్ని బావి నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లక్ష్మయ్యకు భార్య మాత్రమే ఉంది. సంతానం లేరు. కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, ఏఎస్‌ఐ కల్లు శ్రీనివాసరెడ్డి సహాయక చర్యలను పర్యవేక్షించారు.

మహిళా కూలీలను ఢీకొట్టిన టాటా ఏస్

- ముగ్గురికి గాయాలు

కోదాదరూరల్: రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న మహిళా కూలీలను టాటా ఏస్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన కోదాడ మండలం దోరకుంట శివారులో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దోరకుంట గ్రామానికి చెందిన మహిళా కూలీలు నాట్లు వేసేందుకు విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి వెంట నడుచుకుంటూ వెళ్తున్నారు. ఈ క్రమంలో విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న టాటా ఏస్ వాహనం వారిని గ్రామ శివారులో ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో సుంకరి రాజ్యలక్ష్మి, దొంగరి రమాదేవి, ఎర్రంశెట్టి కావ్యకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాజ్యలక్ష్మికి తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం కోదాడ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాధితుల కుటుంబ సభ్యులు కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

యాదాద్రిలో తగ్గిన భక్తుల రద్దీ


భక్తులు లేక బోసిపోయిన ఉత్తర మాడ వీధి

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు తక్కువ సంఖ్యలో వచ్చారు. సికింద్రాబాద్‌లో మహంకాళి అమ్మవారికి బోనాలతో పాటు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో స్వామివారి చెంతకు భక్తుల రాక గణనీయంగా తగ్గింది. దీంతో స్వామి వారి ధర్మ దర్శనానికి గంట, వీఐపీ దర్శనానికి 30 నిమిషాల సమయం పట్టింది. స్వామి వారిని 30వేల వరకు భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఆదివారం కిటకిటలాడే ఆలయ పరిసరాలు.. భక్తులు లేక బోసిపోయాయి. వివిధ పూజలతో నిత్యాదాయం రూ.25,23,042 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.

నూతన విద్యా విధానాన్ని అమలు చేసే కుట్ర



మాట్లాడుతున్న నాగరాజు

కొండమల్లేపల్లి : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నూతన విద్యావిధానాన్ని (ఎన్‌ఈపీ) అమలు చేసే కుట్ర చేస్తోందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ డిమాండ్ చేశారు. కొండమల్లేపల్లిలో ఆదివారం నిర్వహించిన ఎస్‌ఎఫ్‌ఐ నల్లగొండ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ తరగతులను నిర్వహించాలనే ప్రతిపాదనతో విద్యారంగానికి నష్టం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని కేటాయించాలని, విద్యారంగ సమస్యలపై సీఎం విద్యార్థి సంఘాలతో సమావేశమై చర్చించాలన్నారు. ఈ సమావేశంలో లక్ష్మీనారాయణ, ఖమ్మంపాటి శంకర్, కుంచం కావ్య, లక్ష్మణ్‌నాయక్, వెంకటేష్, సైదానాయక్, కోరే రమేస్, రవీందర్, హర్షవర్దన్, స్పందన తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

పెద్దఅడిశర్లపల్లి: బైక్‌పై వెళ్తూ ఆర్టీసీ బస్సును ఢీకొట్టి యువకుడు దుర్మరణం చెందాడు. మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పెద్దఅడిశర్లపల్లి మండలం కోనమేకలవారిగూడెం గ్రామ స్టేజీ సమీపంలో కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి(సాగర్) మండలం అల్వాలకు చెందిన లింగంపల్లి కొండల్(19) పెద్దవూర మండలం పులిచర్లలోని తన అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. పని నిమిత్తం ఆదివారం తన బావమరిది వాకిటి అజయ్‌తో కలిసి బైక్‌పై పెద్దఅడిశర్లపల్లి మండలం అంగడిపేట ఎక్స్ రోడ్ వద్దకు వచ్చి తిరిగి పులిచర్లకు వెళ్తుండగా.. పెద్దఅడిశర్లపల్లి మండలం కోనమేకలవారిగూడెం గ్రామ స్టేజీ సమీపంలో కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై దేవరకొండ నుంచి మిర్యాలగూడకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కొండల్ అక్కడికక్కడే మృతి చెందగా, అజయ్‌కి తీవ్రగాయాలయ్యాయి. అజయ్‌ని చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సూర్యక్షేత్రంలో భక్తుల ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయాసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపించారు. ఆ తర్వాత యజ్ఞశాలలో మహాసౌరహోమాన్ని నిర్వహించారు. అదేవిధంగా క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్తూపాలను భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాదసత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకులు జనార్దన్‌స్వామి, గణపురం నరేష్, బీరవోలు ఇంద్రారెడ్డి, పాలెల్లి వెంకటేశ్వర్లు, అర్చకులు మిర్యాల రామశర్మ, వేణుగోపాలశర్మ, భక్తులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత.. ఐదుగురి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ చరమందరాజు

నేరేడుచర్ల: నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని ఆదివారం పోలీసులు అరెస్ట్ చేసి, వారి నుంచి 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని మల్లికార్జున రైస్ మిల్లు సమీపంలో గల వెంచర్‌లో కొందరు గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో నేరేడుచర్ల ఎస్‌ఐ రవీందర్‌నాయక్, పోలీస్ సిబ్బందితో కలిసి దాడులను నిర్వహించారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలోని యాదాద్రి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లో పనిచేసేందుకు బిహార్ రాష్ట్రం నుంచి వచ్చిన రాంచంద్రమహార, సునీల్ ప్రసాద్‌తో పాటు సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం సాదుతండాకు చెందిన ధారవత్ ముఖేష్, పాలకీడు మండలం మీగడంపాడుతండాకు చెందిన మాలోతు సంతోష్, మఠంపల్లి మండలం మచ్చతండాకు చెందిన రూపావత్ సాయికుమార్‌ను అరెస్ట్ చేశారు. వారి నుంచి 100 గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసిన ఎస్‌ఐ రవీందర్‌నాయక్, ఏఎస్‌ఐ సైదులు, పోలీసు సిబ్బంది సురేష్, వెంకట్, జుబేరీపాషా, మతిన్‌ను సీఐ అభినందించారు.

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య


నవీన్ కుమార్ (ఫైల్)

బొమ్మలరామారం: అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బొమ్మలరామారం మండలం చీకటిమామిడి గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చీకటిమామిడి గ్రామానికి చెందిన కదారి నవీన్ కుమార్(32) వృత్తిరీత్యా కటింగ్ షాపు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా అతడు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. తన ఆరోగ్యం కుదుటపడటం లేదని తీవ్ర మనస్తాపానికి గురైన నవీన్ కుమార్ ఆదివారం తెల్లవారుజామున తన ఇంట్లో చీరతో ఉరేసుకుని మృతిచెందాడు. మృతుడి భార్య కదారి భాగ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాఘవేందర్‌గౌడ్ తెలిపారు.

ఏడు కోడెదూడల పట్టివేత

కోదాదరూరల్: అక్రమంగా తరలిస్తున్న ఏడు కోడెదూడలను ఆదివారం కోదాడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణా జిల్లా పెనుగంచిప్రోలు మండలం ముచ్చింతల నుంచి పశువుల వ్యాపారం చేసే జిడ్డు నాగరాజు ఏడు కోడెదూడలను వాహనంలో కోదాడ సంతకు తరలిస్తుండగా.. రామాపురం క్రాస్ రోడ్‌లో పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన దూడలను కట్టంగూరులోని గోశాలకు తరలించి డ్రైవర్ ప్రకాష్‌రావుతో పాటు పశువుల వ్యాపారి నాగరాజుపై కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రకృతి.. సకల ఔషధాల నిధి


మాట్లాడుతున్న ప్రకృతి వైద్యుడు రామచంద్రరావు


సదస్సుకు హాజరైన ప్రజలు

- ప్రకృతి వైద్యుడు రామచంద్రరావు

రామగిరి(నల్లగొండ): ప్రకృతి సకల ఔషధాల నిధి అని సిద్దార్థ యోగా విద్యాలయం, ప్రకృతి వైద్యుడు కేవై రామచంద్రరావు అన్నారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, సిద్దార్థ యోగా విద్యాలయం సంయుక్తంగా నల్లగొండ పట్టణంలోని చినవెంకట్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన 'ప్రకృతి జీవన విజ్ఞానం' ఆరోగ్య సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రకృతిపై అవగాహన ఉంటే చిన్న చిన్న రోగాలను ఒక్క రూపాయి ఖర్చు లేకుండా దూరం చేసుకోవచ్చన్నారు.యోగా, మెడిటేషన్‌తో పాటు జొన్నలు, రాగులు, మినుములు వంటి మిల్లెట్స్‌ను ఆహారంగా తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. ఇలాంటి సదస్సులు నిర్వహించిన గాంధీ గ్లోబల్ ఫ్యామిలీకి అభినందనలు తెలిపారు. ప్రముఖ ప్రకృతి వైద్య నిపుణుడు ఎన్‌జీ పద్మ మాట్లాడుతూ.. సిద్దార్థ యోగా విద్యాలయం రూపొందించిన డైట్ షీట్‌ను దైనందిక జీవితంలో అలవాటు చేసుకోవాలని అన్నారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సంస్థల చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సంస్థల ద్వారా ఆరోగ్య సదస్సులు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి నల్లగొండ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి సుమారుగా 1200 పైగా ప్రముఖులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యావేత్తలు, విద్యార్థులు, క్రీడాకారులు, యువతీయువకులు హాజరయ్యారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ యానాల ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో డాక్టర్స్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ యూట్యూబ్ ఇన్‌ఫ్లూయెన్సర్ ఏచూరి శైలజ, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు బొమ్మపాల గిరిబాబు, పాముల అశోక్, లోకనబోయిన రమణ, గిరిధర్‌రావు, నాగమణిరెడ్డి, ముక్కామల నరసింహ, ఎండీ అజీజ్, దశరథగౌడ్, పజ్జూరి రవీందర్‌రెడ్డి, ప్రముఖ పర్యావరణవేత్త మిట్టపల్లి సురేష్‌గుప్తా, ట్రస్మా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోడి శ్రీనివాస్, జీవీ రావు తదితరులు పాల్గొన్నారు.